క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి చర్యలు



నందిగామ: ప్రజలు ఇచ్చిన వినతులను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్డీఓ రవీంద్రరావు తెలిపారు. స్థానిక కార్యాలయంలో సోమవారం 'స్పందన' నిర్వహించారు. డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల నుంచి 6 అర్జీలు అందాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ప్రజా సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకే ప్రభుత్వం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డివిజన్ పరిధిలోని మండల కేంద్రాలతో పాటు ఆర్డీవో కార్యాలయంలోనిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు.

ఘనంగా పూర్ణాహుతి

నందిగామ: పట్టణంలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణ మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పూర్ణాహుతి, వసంతోత్సవ కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం సమయంలో సహస్ర దీపోత్సవ కార్యక్రమం జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణోత్సవం



జగ్గయ్యపేట అర్బన్: మాఘ పౌర్ణమి సందర్భంగా వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా పట్టణంలోని రంగనాయకస్వామి వారి ఆలయంలో సోమవారం స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. తొలుత సంప్రదాయబద్ధంగా ఎదుర్కోల ఉత్సవాన్ని నిర్వహించారు. అనంతరం పూలతో, విద్యుత్ దీపాలతో అలంకరించిన కల్యాణ మండపంలో పరాంకుశం వాసుదేవాచార్యులు యాగ్నిక నిర్వహణలో వేద మంత్రోచ్చారణల మధ్య స్వామి వారి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు తిరునగరి రామకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో అర్చక బృందం కల్యాణ కార్యక్రమాలు చేశారు. ప్రముఖులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. దేవ దాయ శాఖ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వినతి

కంచికచర్ల: స్పందన కార్యక్రమంలో సోమవారం ఐదు అర్జీలు స్వీకరించినట్లు తహసీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి తెలిపారు. ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని మూడు, డ్రెయినేజీ పనులు పంచాయతీ అధికారులు చేపట్టాలని రెండు అర్జీలు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కే బాలశంకరరావు, ఏపీఓ కోట భాస్కరరావు, ఏఓ విజయకుమార్, పీఆర్ఏఈ రవికుమార్, డెప్యూటీ తహసీల్దార్ నాగుల్‌మీరా, ఆర్ఐ శిరీష, తదితరులు పాల్గొన్నారు.

రేపు కేవీకేలో సమావేశం

గరికపాడు(జగ్గయ్యపేట): స్థానిక కేవీకేలో ఈ నెల 8న ఖరీఫ్, రబీ–2023 సంవత్సరానికి సంబంధించి శాస్త్రీయ సలహా సంఘ సమావేశం జరుగుతుందని ప్రోగ్రాం కో ఆర్డినేటర్ వెంకట సుబ్బయ్య సోమవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు జరగనున్న సమావేశానికి రైతులు హాజరు కావాలని ఆయన కోరారు.

నిత్యాన్నదానానికి విరాళం

తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలోని వాల్మీకోద్భవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి భక్తుడు రూ.25,116 విరాళం సోమవారం అందించినట్లు ఆలయ ఈవో శ్రీరామవరప్రసాదరావు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లికి చెందిన తీగల నాగవీర వెంకట సుబ్రహ్మణ్యం దంపతులు ఈ విరాళాన్ని అందించారన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ సుబ్రహ్మణ్యం, ప్రధానార్చకుడు తిరునగరి రామకృష్ణమాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

20 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

వీరులపాడు: రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ సోమేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని కోళ్ల ఫారాలపై సోమవారం రాత్రి ఆయన మెరుపు దాడులు చేశారు. మండలంలోని పెద్దాపురం, అల్లూరు గ్రామ శివారుల్లోని కోళ్ల ఫారాలలో అక్రమ రేషన్ బియ్యం నిల్వలు ఉన్నాయనే సమాచారంతో దాడి చేశామన్నారు. ఈ దాడిలో 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. రేషన్ బియ్యాన్ని కోళ్లఫారాలకు తరలిస్తున్నారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెండు కోళ్ల ఫారాలపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు. ఈ దాడిలో పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని రంగాల అభివృద్ధికి ప్రాధాన్యం

- ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు
- జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి
- 29 అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి రూ.4.64 కోట్లు మంజూరు



పరిటాలలో పైప్‌లైన్ పనులకు భూమిపూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు

కంచికచర్ల: రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇచ్చి అవసరమైన నిధులు మంజూరు చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు అన్నారు. మండలంలోని పరిటాల గ్రామంలో రూ.16 లక్షలతో అంగన్‌వాడీ కేంద్రం నూతన భవన నిర్మాణానికి, జలజీవన్ మిషన్ కింద ఇంటింటికీ కుళాయి ఏర్పాటుకు పైప్‌లైన్ ఏర్పాటుకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో 29 అంగన్‌వాడీ కేంద్ర భవనాల నిర్మాణానికి రూ.4.64కోట్ల నిధులు మంజూరయ్యాయని చెప్పారు. నందిగామ ప్రాజెక్టు పరిధిలో 16, కంచికచర్ల ప్రాజెక్టు పరిధిలో 13 అంగన్‌వాడీ కేంద్రాలకు కొత్త భవనాలు త్వరతిగతిన పూర్తిచేయాలని తెలిపారు. నాణ్యత లేకపోతే బిల్లులు చెల్లించేది లేదని తెలిపారు. ప్రతి ఇంటికీ కుళాయి ఏర్పాటు చేసి స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ప్రభుత్వం జలజీవన్ మిషన్ పథకం నిర్వహణకు రూ.68 లక్షల నిధులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే అన్నారు. ప్రధాన పైప్‌లైన్ పనులను త్వరతిగతిన పూర్తిచేసి ఇంటింటికి తాగునీరు సరఫరా చేయాలని ఆదేశించారు. నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలల అభివృద్ధి, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, గ్రామ సచివాలయాల భవన నిర్మాణాలకు ప్రభుత్వం లక్షల కోట్ల నిధులు కేటాయించిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, జెడ్పీటీసీసభ్యురాలు వేల్పుల ప్రశాంతి, సర్పంచి యద్దనపూడి ఆనందజ్యోత్స్న, ఎంపీటీసీ సభ్యురాలు కర్ల రాధిక, ఏఎంసీ మాజీ చైర్మన్ మార్త రజనీ, సొసైటీ అధ్యక్షుడు నెమలపురి అమ్మారావు, మాగంటి వినయభూషణరావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు కంచర్ల పద్మావతి, మాజీ సర్పంచి వల్లెపు సాంబ, వైఎస్సార్‌సీపీ నాయకులు చింతా రవీంద్రనాథ్, మార్త శ్రీనివాసరావు, జిక్కుల నరసింహారావు, వేముల జీవరాజు, యద్దనపూడి విజయారావు, తహసీల్దార్ వీ రాజకుమారి, ఎంపీడీఓ కే బాలశంకరరావు, పంచాయతీ కార్యదర్శి మీర్జావలి, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో మేటిగా పట్టణం అభివృద్ధి

ప్రభుత్వ విప్ ఉదయభాను



అభివృద్ధి పనుల శిలాఫలకం ఆవిష్కరణలో ప్రభుత్వ విప్ ఉదయభాను, అల్ట్రాటెక్ అధికారులు

జగ్గయ్యపేట అర్బన్: ఎన్టీఆర్ జిల్లాలో ప్రముఖ పర్యాటక కేంద్రంగానే కాకుండా అన్ని విధాలుగా అభివృద్ధి చెందిన మేటి పట్టణంగా జగ్గయ్యపేటను అభివృద్ధి చేయనున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. సోమవారం స్థానిక చెరువు బజారు వద్ద ఊర చెరువు అభివృద్ధి, మురుగు నీటి శుద్ధీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. ఆర్వో వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఉదయభాను ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధిలో ఎక్కడా రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. నేడు జగనన్న పాలనలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా రాష్ట్రం ప్రగతి పథకంలో పరుగులు పెడుతున్నట్లు తెలిపారు. మొదటి విడతగా రూ.5 కోట్లతో హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్, ఖమ్మంలోని లకారం చెరువు, పార్కు మాదిరిగా పట్టణంలోని చెరువును పర్యాటక కేంద్రంగా సుందరీకరిస్తున్నట్లు తెలిపారు. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, గ్రీనరీ, బోట్ షికారు, లైటింగ్ ఇతర హంగులతో ప్రముఖ పర్యాటక కేంద్రంగా జగ్గయ్యపేటను మార్చుతామన్నారు.

అల్ట్రాటెక్ సహకారంతో..

అల్ట్రా టెక్ సిమెంట్స్, బూదవాడ సహకారంతో చెరువు అభివృద్ధి కోసం రూ.కోటి, చెరువు బజారు ప్రజల కోసం ఆర్వో వాటర్ ప్లాంట్‌కు రూ.9 లక్షల వంతున వారి సీఎస్సార్ నిధుల నుంచి కేటాయించడం స్ఫూర్తిదాయకమన్నారు. ఈ రోజు ప్లాంట్‌ను ప్రారంభించామన్నారు. ఈ మధ్య కాలంలో రూ.17 లక్షలతో బాలుర హైస్కూల్‌కు భోజనశాల ఏర్పాటు, తొర్రగుంటపాలెంలో రూ.6 లక్షలతో మరొక వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారని, ఇలా నియోజకవర్గ అభివృద్ధికి వారు అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్లు తుమ్మల ప్రభాకర్, హఫీజున్నీసా, స్థానిక కౌన్సిలర్ తన్నీరు నాగమణి నాగేంద్ర, కమిషనర్ శివకోటేశ్వరరావు, పలువురు కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, పార్టీ నాయకులు, అల్ట్రాటెక్ యూనిట్ హెడ్ డాక్టర్ కె.శ్రీధర్, హెచ్ఆర్ హెడ్ ఏవీఎన్.సతీష్‌కుమార్, సీఎస్సార్ ఇన్‌చార్జ్ రాజేష్, పాల్గొన్నారు.

ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణం పూర్తి చేయండి



అధికారులు, ప్రజాప్రతినిధుల సమావేశంలో పీడీ శ్రీదేవి, పక్కన అధికారులు

గృహ నిర్మాణశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవి

కంచికచర్ల: వైఎస్సార్ జగనన్న కాలనీ లే అవుట్లలో మంజూరై వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న, ఇళ్లను ఉగాదినాటికి పూర్తి చేయాలని గృహ నిర్మాణశాఖ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవి అన్నారు. కంచికచర్ల మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, విద్యుత్, ఉపాధిహామీ పథకం, వైఎస్సార్ క్రాంతిపథం, గృహ నిర్మాణశాఖ, గ్రామ సచివాలయ అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. శ్రీదేవి మాట్లాడుతూ కంచికచర్ల మండలంలో 23 వైఎస్సార్ కాలనీ లే అవుట్లు ఉన్నాయని, 16 లే అవుట్లో మాత్రమే ఇళ్ల నిర్మాణపనులు చేపట్టారన్నారు. ఇప్పటివరకు స్వంత స్థలాల్లో కానీ, జగనన్న కాలనీ లే అవుట్లలో కానీ 378 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయన్నారు. మిగిలిన 580 ఇళ్లు పూర్తి చేయాల్సి ఉందన్నారు. అయితే ఉగాదినాటికి మండలంలో 958 ఇళ్లు పూర్తి చేయాల్సి ఉందని, వీటిని పూర్తి చేసేలా చూడాలని ఆదేశించారు.

లబ్ధిదారులు ఇళ్లు కట్టుకునే సమయంలో ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు దగ్గరుండి సహకరించాలన్నారు. సమావేశంలో ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, మండల ప్రత్యేకాధికారిణి, ఉమాదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి, వైఎస్ ఎంపీపీ బండి మల్లిఖార్జునరావు, సర్పంచి వేల్పుల సునీత, తహసీల్దార్ వీ రాజకుమారి, ఎంపీడీఓ కే బాలశంకరరావు, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, హౌసింగ్ ఏఈ నరసింహారావు, విద్యుత్‌శాఖ ఏఈ కృష్ణారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయి లక్ష్మీప్రియ, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

బెల్లం విక్రేతల అరెస్ట్



ఎస్ఈబీ అధికారులు స్వాధీనం చేసుకున్న బెల్లం


తిరువూరు: సారా నియంత్రణలో భాగంగా తిరువూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు సోమవారం విస్తృత దాడు లు నిర్వహించారు. విస్సన్నపేట మండలం తాతకుంట్ల తండా, చంద్రుపట్ల తండాలో సారా తయారీకి అవసరమైన బెల్లం సరఫరా చేస్తున్న మునునూరు మండలం చెక్కపల్లికి చెందిన కొత్తగుండ్ల ప్రభాకరరావును, రెడ్డిగూడెం మండలం సీతారాంపురానికి చెందిన భరోతు కుమార్‌ను అరెస్టు చేసినట్లు ఎస్ఈబీ సీఐ గురవయ్య తెలిపారు. ఇరువురి వద్ద 554 కిలోల బెల్లం, మారుతీ కారు, మినీ వ్యాను స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరు పరచగా, మేజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్‌కు ఆదేశించారని తెలిపారు. సారా తయారీదారులకు బెల్లం సరఫరా చేసే వ్యక్తుల సమాచారం అందించాలని కోరారు.

హెచ్ఐవీ బాధితులను ఆదరించాలి

గణపవరం(మైలవరం): హెచ్ఐవీ బాధితుల పట్ల ప్రేమతో మెలగాలని, నిరాదరణకు గురిచేయకూడదని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం జిల్లా రిసోర్స్‌పర్సన్ ఎల్. సురేష్‌కుమార్ తెలిపారు. గణపవరం విలేజ్ క్లినిక్ సెంటర్‌లో ఎయిడ్స్ నియంత్రణ నివారణ సంస్థ సహకారంతో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీమ్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. చంద్రాల పీహెచ్‌సీ డాక్టర్ నరేష్ మాట్లాడుతూ విలేజ్ క్లినిక్‌ల ద్వారా గ్రామాల్లోనే వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు ఇస్తామన్నారు. వి.సుందరరావు, రూతమ్మ, సుందరమ్మ పాల్గొన్నారు.

బీసీలు హక్కుల సాధనకు పోరాడాలి

బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు



మాట్లాడుతున్న కేశన శంకరరావు తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: జనాభాలో సగానికి పైబడి ఎక్కువ ఉన్న బీసీలంతా తమ హక్కుల సాధన కోసం పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు పిలుపు నిచ్చారు. ఈనెల 12న బీసీ ఆత్మగౌరవ సభకు సంబంధించి 'చలో గుంటూరు' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు అంగడాల పూర్ణచంద్రరావు గృహంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. శంకరరావు మాట్లాడుతూ విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థలో 27 శాతంతోనే సరిపెట్టుకోవాల్సి వస్తున్నందున బీసీలంతా పోరాటం చేయాలని తెలిపారు. దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు అంగడాల పూర్ణచంద్రరావు, మాజీ ఎంపీపీ పెంటి శ్రీనివాసరావు, బీసీ నాయకులు చల్లా వైకుంఠరావు, శ్రీనివాసగౌడ్, షేక్ ముస్తాఫా, జల్లా తిరుపతిరావు, తూమాటి కృష్ణ, పోలంపల్లి రాధమ్మ, గుర్రం ద్వారక, దేవరకొండ శ్రీనివాస్, జవ్వాజి నరసింహారావు, గోనెల పద్మ, వేముల మల్లేశ్వరరావు, పచ్చిపాల నాగేశ్వరరావు, గుంజా హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందు కొడితే పంట నాశనం

స్పందనలో అధికారులకు బాధిత రైతు ఫిర్యాదు

గంపలగూడెం: తనకు చెందిన 3.07 ఎకరాల్లో సాగు చేసిన మొక్కజొన్నకు ఆశించిన పురుగు నివారణకు మందు పిచికారీ చేస్తే పంట నాశనం అయిందంటూ అనుముల్లంకకు చెందిన రైతు గొరసాని వెంకటరెడ్డి స్పందనలో అధికారులకు ఫిర్యాదు చేశాడు. గంపలగూడెం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో బాధిత రైతు తనకు నష్టపరిహారం ఇప్పించాలని, ఇప్పటికే నెలరోజు వయస్సు మొక్కజొన్నకు రూ.70వేలకు పెట్టుబడి పెట్టాను అని ఫిర్యాదులో పేర్కొన్నాడు. చెన్నవరానికి చెందిన రైతు పోతురాజు శ్రీనివాసరావు తన వ్యవసాయ భూమికి పట్టాదారు పాస్‌పుస్తకం మంజూరు చేయాలని, రైతు భరోసా సాయం తనకు బ్యాంకు అకౌంట్లలో జమ కాలేదంటూ ఆర్లపాడుకు చెందిన ఎ.నాగమణి మరో దరఖాస్తు ఇచ్చారు. సామాజిక పెన్షన్ మంజూరు చేయాలంటూ కను మూరు చెందిన యరసాని సంజీవ రెడ్డి దరఖాస్తు ఇచ్చారు. తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు గంట బహూకరణ



ధర్మవరప్పాడుతండ(జగ్గయ్యపేట): గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలకు అదే పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు లక్ష్మణరావు సోమవారం ఇత్తడి గంటను ప్రధానోపాధ్యాయుడు హనుమంతుకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధిలో ఉపాధ్యాయులు భాగస్వాములవటం అభినందనీయమన్నారు. పలువురు ఉపాధ్యాయులు విద్యార్థులకు భోజనం బాక్సులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు మహాశివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష

ముక్త్యాల(జగ్గయ్యపేట): మండలంలోని ముక్త్యాల గ్రామంలో భవానీ ముక్తేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలపై పలు శాఖల అధికారులతో సమీక్షా సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో నాగరాజు సోమవారం తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు నందిగామ ఆర్డీవో రవీంద్ర అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఈవో నాగరాజు కోరారు.

పేదల వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట

ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రభుత్వవిప్ ఉదయభాను, తదితరులు

వత్సవాయి: పేదల వైద్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను పేర్కొన్నారు. సోమవారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో దాతల సహకారంతో రూ.18 లక్షలతో నూతనంగా నిర్మించిన భవనాన్ని ఆయన ప్రారంభించారు. గుత్తా వీరయ్య జ్ఞాపకార్థం చిరుమామిళ్ల రాంబాబు, విజయలక్ష్మి, గుత్తా రంగారావు, శేషమణి దంపతుల సహకారంతో ఈ భవనాన్ని నిర్మించడం సంతోషకరమన్నారు.

కార్పొరేట్ వైద్యాన్ని పేదలకు చేరువచేసింది వైఎస్సార్, జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. ముఖ్యమంత్రి చేస్తున్న కార్యక్రమాలకు ఆకర్షితులవుతున్న దాతలు కూడా ముందుకువచ్చి గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు అందిస్తున్నారన్నారు. అనంతరం దాతలను సన్మానించారు. వత్సవాయిలో నిర్మిస్తున్న సచివాలయల భవనాలు, రైతుభరోసా కేంద్రాలను పరిశీలించి త్వరితగతిన పూర్తిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి సుష్మాప్రియదర్శిని, సర్పంచ్ భూక్యా సీతమ్మ, జెడ్పీటీసీ యేశపోగు దేవమణి, ఎంపీపీ చెంటేటి వెంకటేశ్వర్లు, మండల పార్టీ అధ్యక్షులు గాదెల రామారావు, సొసైటీ అధ్యక్షులు రంగిశెట్టి ముత్తయ్య, కాటేపల్లి రవి, సర్పంచులు వడ్డే పరమయ్య, గుడేటి శారమ్మ, నాయకులు భూక్యా రాజానాయక్, మధుసూదన్‌రెడ్డి, అన్నెపాక నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే సమర్థవంతంగా నిర్వహించాలి

నందిగామ నగర పంచాయతీ కమిషనర్ డాక్టర్ జయరాం

నందిగామ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ సర్వే కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని కమిషనర్ డాక్టర్ జయరాం సిబ్బందికి సూచించారు. నగర పంచాయతీ కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి సోమవారం జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్షణ పథకంపై ప్రత్యేక వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జగనన్న భుహక్కు కు సంబంధించి నగర పంచాయతీ పరిధిలో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఈ నేపథ్యంలో సిబ్బంది 16(ఎ)లో డేటా ఎంట్రీ చేసే విధానంపై అవగాహన పెంచుకోవాలన్నారు. పట్టణ సరిహద్దులు, సచివాలయాల, వార్డు సరిహద్దులను సరైన పద్ధతిలో గుర్తించి రీ సర్వేను విజయవంతం గా పూర్తి చేయాలని సూచించారు. టౌన్ ప్లానింగ్ అధికారిని ఝాన్సీ, సిబ్బంది పాల్గొన్నారు.

చిరు ధాన్యాల సాగుకు ప్రోత్సాహం

నందిగామ ఏడీఏ రమణమూర్తి



జొన్న పంటను పరిశీలిస్తున్న ఏడీఏ రమణమూర్తి

కంచికచర్ల: మండలంలోని పరిటాల రైతు భరోసా కేంద్రం వద్ద సోమవారం 'చిరు ధాన్యాలు క్లస్టర్ గ్రూపుల ఏర్పాటు, చిరుధాన్యాలు ఆరోగ్యంపై చూపే సత్ఫలితాలు' అనే అంశంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అంతరకు ముందు నందిగామ ఏడీఏ ధర్మపురి రమణమూర్తి రైతులతో కలసి జొన్న, హైబ్రిడ్ జొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి ఈ సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిందన్నారు. చిరుధాన్యాలు సాగుచేసే ప్రతి క్లస్టర్ రైతుకు ప్రతి హెక్టార్‌కు రూ.6 వేలు చొప్పున వివిధ వనరులు, వ్యవసాయ పనిముట్లను రాయితీపై అందిస్తామన్నారు. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో రూ.1,50 లక్షలు సబ్సిడీపై ప్రాసెసింగ్ యూనిట్లను రాయితీపై అందిస్తామని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి కే విజయకుమార్, గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

డ్రాయింగ్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ



జేసీ నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న విద్యార్థి జువల్లిక

జగ్గయ్యపేట అర్బన్: విజయవాడలోని స్ఫూర్తి ఆర్ట్ అకాడమీ నిర్వహించిన సలాం ఇండియా–ఆర్ట్ కాంటెస్ట్‌లో జగ్గయ్యపేట చేగు విద్యాలయానికి చెందిన 8వ తరగతి విద్యార్థి ఎస్.జువల్లిక రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంకు సాధించింది. సోమవారం చేగు విద్యాలయం ప్రిన్సిపల్ ఆర్.నరసింహారావు, యాజమాన్య కమిటీ ప్రతినిధు కె.మల్లిఖార్జునరావు తదితరులు విద్యార్థి జువల్లికను, కాంటెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 5వ తేదీన విజయవాడలోని కేబీఎన్ కళాశాలలో నిర్వహించిన కాంటెస్ట్‌లో మొత్తం 2100 మంది పాల్గొనగా, 8,9,10 తరగతుల విభాగంలో చేగు విద్యాలయం నుంచి కె.శైలజ, ఎ.చేతస్‌నాయక్, సీహెచ్.చంద్రిక పాల్గొన్నారని తెలిపారు. ఇండియన్ ఆర్మీ అవర్ డిఫెన్స్ అనే అంశంపై డ్రాయింగ్ పోటీలు నిర్వహించారని తెలిపారు. జేసీ శ్రీవాస్ నూపూర్ చేతుల మీదుగా జువల్లిక ప్రశంసాపత్రాన్ని అందుకున్నారని తెలిపారు.

ఘనంగా వేంకటాచలస్వామి నగరోత్సవం



తిరువూరు వేంకటాచలస్వామి కల్యాణం

తిరువూరు: స్థానిక వేంకటాచలస్వామి దేవస్థానంలో తిరు కల్యాణోత్సవాలలో భాగంగా సోమవారం స్వామివారి నగరోత్సవం నిర్వహించారు. ఆదివారం రాత్రి తిరుకల్యాణాన్ని ఉభయదంపతులు పీటలపై కూర్చుని జరిపించారు. తొలుత కొఠాయి మంటపం వద్ద ఎదుర్కోలు ఉత్సవాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. కల్యాణోత్సవం సందర్భంగా స్వామిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ ముత్తారావు, మేనేజరు వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు. వేదపండితులు దివి ఉదయకుమారాచార్యులు, ఆలయ అర్చకులు దేవయాజనం వేణుగోపాలకృష్ణమాచార్యులు, ఎస్ సీహెచ్ విఠలాచార్యులు కల్యాణోత్సవం జరిపించారు. ఏసీపీ రమేష్, తిరువూరు సీఐ భీమరాజు, ఎస్ఐలు దుర్గాప్రసాద్, పద్మారావు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

మహిళలు స్వయం ఉపాధితో అభివృద్ధి చెందాలి



కుట్టు శిక్షణను ప్రారంభిస్తున్న పద్మ, పక్కన ఏసీపీ రమేష్, గోపాల్‌రావు

మైలవరం: మహిళలు స్వయం ఉపాధితో తమ కుటుంబాలను ఆర్థికంగా అభివృద్ధి చేసుకోవాలని మైలవరం ఏసీపీ ఎం.రమేష్ తెలిపారు. మైలవరం మదర్ థెరీసా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వెల్వడం గ్రామానికి చెందిన కుడుముల పద్మజ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ప్రవాసాంధ్రులు కుడుముల వెంకట నారాయణరెడ్డి సహకారంతో ట్రస్టు కార్యాలయంలో మహిళలకు ఉచిత టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సులు సోమవారం ప్రారంభించారు. ఏసీపీ మాట్లాడుతూ ఉచిత శిక్షణ కార్యక్రమాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ట్రస్టు గౌరవాధ్యక్షురాలు ప్రొఫెసర్ పద్మ(యూఎస్ఏ) మాట్లాడుతూ మహిళలు ఉపాధి పొందడానికి చక్కటి అవకాశమని, స్వయంగా ఆర్థిక అభివృద్ధి పొందాలన్నారు. ట్రస్టు అధ్యక్షురాలు కోయ సుధ , ఎస్ఐ రాంబాబు, పద్మజ చారిటబుల్ ట్రస్టు కార్యదర్శి గోపాలరావు, మోస్ట్ ట్రస్ట్ జాయింట్ సెక్రటరీ వసుకుమార్, మిక్కిలి సాంబశివరావు, కోటేశ్వరరావు, శిక్షకులు కృష్ణకుమారి, షహీదా పాల్గొన్నారు.